క్లుప్తంగా

ఆర్థిక సాయం


పాస్టర్ కుటుంబానికి నగదు అందజేస్తున్న సభ్యులు

బేతంచెర్ల: మండలంలోని సిమెంట్ నగర్ గ్రామంలోని యెహోవాయిరే చర్చిలో పాస్టర్‌గా పని చేస్తున్న డేవిడ్ బ్లెసింగ్‌టన్‌కు ఓపెన్ హార్ట్ సర్జరీ జరిగింది. బేతంచెర్ల పాస్టర్ అసోసియేషన్ తరపున పాస్టర్ కుటుంబానికి రూ.16,300 అందజేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు దాసన్న, ప్రసాద్, సభ్యులు సామేలు, ఆనంద్, జయరాజ్, సురేంద్ర, మల్లేష్ బాబు, హెండ్రీ బాబు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పేట తిరునాల


పాండురంగ విఠలేశ్వరుడు

కోవెలకుంట్ల: పట్టణంలోని రంగరాజు పేటలో వెలసిన శ్రీదేవి, భూదేవి సహిత పాండురంగ స్వామి దేవాలయంలో శనివారం పేట తిరునాల ఘనంగా నిర్వహించారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆలయ ప్రధాన అర్చకులు వేణుగోపాల ఆచార్యులు, సుదర్శనచార్యులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పట్టణంలోని ఆయా కాలనీలకు చెందిన భక్తులు ఆలయం చేరుకొని ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. ఆదివారం స్వామి వారి కల్యాణోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ ధర్మకర్త రాంభూల్‌రెడ్డి తెలిపారు.

దద్దణాల ప్రాజెక్టుకు ఐదడుగుల నీరు

బనగానపల్లె రూరల్ : మండలంలోని మేజర్ ఇరిగేషన్ ప్రాజెక్టు దద్దణాల ప్రాజెక్టుకు ఐదడుగుల నీటి మట్టం చేరినట్లు మైనర్ ఇరిగేషన్ ఏఈ రఘురామ్ శనివారం తెలిపారు. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా ఈ ప్రాజెక్టుకు వరదనీరు చేరిందన్నారు. అలాగే పసుపల చేరువుకు కూడా ఓ మోస్తరు వరద నీరు చేరినట్లు ఆయన తెలిపారు. శుక్రవారం రాత్రి నుంచి శనివారం వరకు మద్దిలేటిస్వామి క్షేత్రంలో భారీగా కురిసిన వర్షంతో పాటు పసుపల ప్రాంతంలో కురిసిన వర్షం కారణంగా ప్రాజెక్టుకు ఈ వరద నీరు చేరడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

26 నుంచి ఎల్లమ్మ ఉత్సవాలు



డోన్ : పట్టణంలోని తారకరామనగర్‌లో వెలసిన రేణుకా ఎల్లమ్మ ఆలయ ఉత్సవాలు ఈనెల 26వ తేదీ నుండి మూడురోజుల పాటు వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్తలు ఆకుతోట చిన్న ఎల్లయ్య, లక్ష్మీదేవి ఒక ప్రకటనలో తెలిపారు. 26వ తేదీన అమ్మవారికి ప్రత్యేక పూజలు, కుంకుమార్చన, 27న అభిషేకాలు నిర్వహిస్తామన్నారు. 28వ తేదీన 50 తులాల అమ్మవారి వెండి విగ్రహం ప్రతిష్ఠ కార్యక్రమం ఉంటుందన్నారు.

అనాథ మృతదేహానికి అంత్యక్రియలు


అంత్యక్రియలు నిర్వహిస్తున్న సభ్యులు

డోన్ : పట్టణంలోని శ్రీరామ్‌నగర్‌కు చెందిన రాములమ్మ(40) అనే అనాథ మృతి చెందడంతో పోలీసుల సూచన మేరకు శనివారం మృతురాలికి హిందూ సంప్రదాయం ప్రకారం ద్రోణాచలం సేవాసమితి ఆత్మబంధువు సభ్యులు అంత్యక్రియలు నిర్వహించారు. స్థానిక హిందూ శ్మశాన వాటికలో జరిగిన ఈ కార్యక్రమంతో 93వ అనాథ అంత్యక్రియలు పూర్తి చేసినట్లు నిర్వాహకులు షాదీఖాన రాజా తెలిపారు. అంత్యక్రియలకు మల్యాల శ్రీనివాసరెడ్డి, రోటరీక్లబ్ రాజయ్య ఆర్థిక సాయం చేశారన్నారు. కార్యక్రమంలో ఆత్మబంధువు సభ్యులు గురుస్వామి, పానిపూరి మురళి, రసూల్, ఆటో సుధాకర్, కానిస్టేబుల్ షబ్బీర్‌లు పాల్గొన్నారు.

వైభవంగా మహానందీశ్వరుడి కల్యాణం



మహానంది: మహానందిలో కొలువైన శ్రీ కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వర స్వామి వార్లకు శనివారం కల్యాణోత్సవం పూజలు వైభవంగా నిర్వహించారు. ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో వేదపండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర అవధాని, నాగేశ్వరశర్మ, హనుమంతుశర్మ, అర్చకులు శాస్త్రోక్తంగా పూజలు చేపట్టారు. స్థానిక అలంకార మండపంలో జరిగిన కల్యాణోత్సవానికి భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామివారి కల్యాణాన్ని తిలకించారు. కల్యాణం అనంతరం భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు.

కూరగాయల మార్కెట్‌కు నూతన శోభ

- రూ.16కోట్లతో ఆధునిక వసతులతో నిర్మాణం
- 123 దుకాణాల సముదాయం
- తెలంగాణ రాష్ట్రం సిద్ధిపేట మార్కెట్‌లా సౌకర్యాలు
- చిరు వ్యాపారులకు వరంగా మారిన వైనం
- సంతోషం వ్యక్తం చేస్తున్న ప్రజలు, వ్యాపారులు


ఆధునిక వసతులతో నిర్మించిన కూరగాయల మార్కెట్



డోన్ : వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో డోన్ పట్టణం రూపురేఖలు మారిపోయాయి. మౌలిక వసతులు పూర్తి స్థాయిలో కల్పించడంతో ఆయా కాలనీలు కళకళలాడుతున్నాయి. ప్రభుత్వ కార్యాలయాలు, పార్కులు, స్విమ్మింగ్ పూల్స్ నిర్మాణాలు చేపట్టడంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఇందులో భాగంగా కనీస వసతులు కరువైన పాతబస్టాండ్‌లోని కూరగాయల మార్కెట్‌కు సైతం నూతన శోభ సంతరించుకుంది. రూ.16కోట్లతో ఆధునిక వసతులతో కూరగాయల మార్కెట్‌ను నిర్మించింది అధికారయంత్రాంగం. దీంతో మార్కెట్ కళకళలాడుతుంది. మొత్తం 123 దుకాణాల సముదాయంతో తెలంగాణ రాష్ట్రం సిద్ధిపేట మార్కెట్ మోడల్‌లో నిర్మించడంతో ప్రతిఒక్కరూ హర్షం వ్యక్తం చేస్తున్నారు. పాత కూరగాయల మార్కెట్‌లో కేవలం 40 మంది వ్యాపారులు జీవనం సాగిస్తుండగా, కొత్త మార్కెట్‌లో 123 మందికి దుకాణాలు ఏర్పాటు చేశారు. అదేవిధంగా మరో 40 మందికి సెల్లులార్‌లో వ్యాపారాలు చేసుకునేందుకు అవకాశం కల్పించారు అధికారులు. గతంలో నెలకు రూ.50వేల ఆదాయం లభించగా నేడు నెలకు రూ.10లక్షల వరకు అద్దె రూపంలో వస్తుందని అధికారులు చెదుతున్నారు. కూరగాయల మార్కెట్‌ను సకల వసతులతో నిర్మించడంతో గతంలో ఎదుర్కొన్న కష్టాలు తప్పాయని వ్యాపారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.


నూతన కూరగాయల మార్కెట్‌లో ఓ భాగం


ఒకప్పటి కూరగాయల మార్కెట్ (ఫైల్)

గతంలో అన్నీ ఇబ్బందులే....

గతంలో పాతబస్టాండ్‌లోని కూరగాయల మార్కెట్ సమస్యలకు నిలయంగా ఉండేది. వ్యాపారులు, ప్రజలకు అన్నీ ఇబ్బందులే ఎదురయ్యేయి. మార్కెట్‌లోకి రావాలన్నా... బయటకు వెళ్లాలన్నా ఇబ్బందులు తప్పని పరిస్థితి. దిన సంత విషయం అటుంచితే వారపు సంత గురువారం జనంతో కిటకిటలాడేది. లోపలికెళ్లి బయటకు రావాలంటే పద్మవ్యూహాన్ని తలపించేది. జనం ఊపరాడక ఇబ్బందులు పడేవారు. ఇక వర్షం వస్తే అంతేసంగతులు. బురదమయంగా మారేది. వ్యాపారులు సైతం తీవ్ర ఇబ్బందులు పడేవారు. నూతన మార్కెట్ నిర్మాణంతో సమస్యలు తీరాయని ప్రజలతోపాటు వ్యాపారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.


నాడు వర్షాకాలంలో అభద్రతా భావంతో వ్యాపారం నిర్వహిస్తున్న దృశ్యం (ఫైల్)

కష్టాలు తొలిగాయి



ఎండకు, వానకు అభద్రత భావంతో వ్యాపారాలు కొనసాగించేవారం. ఎండకు కూరగాయలు, ఆకుకూరలు ఎండిపోవడం, వర్షాకాలంలో వర్షపునీటి తాకిడికి సరుకు కొట్టుకుపోయి నీటిపాలు కావడం జరిగేది. రాత్రిళ్లు దొంగతనాలు కూడా జరిగేవి. నేడు నూతన మార్కెట్ మూలంగా భద్రంగా, స్వేచ్ఛగా వ్యాపారాలు చేసుకోగలుగుతున్నాం.

– సురేష్, కూరగాయల వ్యాపారి, డోన్

సంతృప్తిగా ఉంది



రాష్ట్రంలో ఎక్కడా లేనివిధంగా అన్ని వసతులతో కూరగాయల మార్కెట్‌ను నిర్మించడం సంతోషకరం. అతితక్కువ కిరాయి చెల్లిస్తూ వ్యాపారాలు చేస్తూ జీవనం సాగిస్తున్నాం. దీనికి ప్రధాన కారణం ఆర్థిక బుగ్గన మంత్రి రాజేంద్రనాథ్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్‌ల చొరవనే.

– గోపాల్, వ్యాపారి, డోన్

నెలకు రూ.10లక్షల ఆదాయం



ఇంతవరకు మున్సిపల్‌కు సంబంధించిన ఆదాయ వనరులు లేకపోవడంతో ప్రజలకు మౌలిక వసతులు కల్పించడం కష్టంగా ఉండేది. జీతభత్యాలు, విద్యుత్ బకాయిలు భారంగా మారేవి. మంత్రి ముందుచూపుతో ఆధునిక కూరగాయల మార్కెట్ ఏర్పాటుచేయడం మూలంగా ఆదాయం 15 రెట్లు పెరిగింది. అదేవిధంగా మార్కెట్ లోపల, వెలుపల వందలాది మంది చిరు వ్యాపారులు స్వేచ్ఛగా వ్యాపారాలు సాగిస్తున్నారు.

– సప్తశైల రాజేష్, మున్సిపల్‌చైర్మన్, డోన్

సబ్ జైలును తనిఖీ చేసిన జడ్జి శేషాద్రి


సబ్ జైలు పరిసరాలను పరిశీలిస్తున్న న్యాయమూర్తులు,


భోజనం రుచి చూస్తున్న జడ్జి లీలా వెంకట శేషాద్రి

డోన్ టౌన్ : పట్టణంలోని సబ్ జైలును జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి లీలా వెంకట శేషాద్రి శనివారం తనిఖీ చేశారు. డోన్ న్యాయమూర్తులు రాహుల్ అంబేడ్కర్, జ్యోతితో కలిసి తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా రికార్డులు పరిశీలించి రిమాండ్‌లో ఉన్న ఖైదీలతో సమావేశమై వారి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఖైదీల వివరాలు తెలుసుకుంటూ బెయిల్‌కు దరఖాస్తు చేసుకున్నారా...న్యాయవాదులను నియమించుకున్నారా అని ఆరా తీశారు. స్వతహాగా న్యాయవాదిని నియమించుకోలేని వారి కోసం ప్రభుత్వం ఉచితంగా న్యాయ సేవలు అందిస్తుందని ఈ సందర్భంగా జడ్జి గుర్తు చేశారు. అనంతరం జైలులో సౌకర్యాలు, భోజన వసతి తదితర విషయాలను ఖైదీలను అడిగి తెలుసుకున్నారు. భోజనం రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం సబ్ జైలులో పరిసరాలను జడ్జి పరిశీలించారు. ఖైదీల కోసం ప్రత్యేకంగా సొంత ఖర్చుతో స్నానపు గదులు, మరుగుదొడ్లు నిర్మించిన జైలర్ రఘునాథ్‌రెడ్డిని ఈ సందర్భంగా జడ్జి అభినందించారు. ఈయన వెంట కోర్టు సిబ్బంది సరిత, కళ్యాణి, సబ్ జైలు సిబ్బంది శ్రీనివాసులు, మద్దిలేటి, నాగార్జున, నాగరాజు,లక్ష్మణరావు, రవి తదితరులు ఉన్నారు.

ఘనంగా వీరబ్రహ్మేంద్రస్వామి గ్రామోత్సవం

బనగానపల్లె : బనగానపల్లె పట్టణంలోని నంద్యాల రోడ్డులో వెలసిన వీరబ్రహ్మేంద్రస్వామి నేల మఠంలో స్వామివారి 331వ ఆరాధన మహోత్సవాల్లో భాగంగా శనివారం శ్రీవీరబ్రహ్మేంద్రస్వామి గ్రామోత్సవం ఘనంగా జరిగింది. ఆలయ అర్చకులు, మఠం పీఠాధిపతి శ్రీనివాస ఆచారి స్వామి, ఈఓ బ్రహ్మానందరెడ్డి ఆధ్వర్యంలో ఉదయం పంచామృతాభిషేకాష్టోత్తర శతనామ పూజ, శ్రీవీరకాళికాంబాదేవి అమ్మవారికి కుంకుమార్చన, శ్రీసూక్త పూజ నిర్వహించారు. సాయంత్రం వీరబ్రహ్మేంద్రస్వామి ఉత్సవ విగ్రహానికి గ్రామోత్సవం సంప్రదాయబద్ధంగా నిర్వహించారు.


శ్రీవీరబ్రహ్మేంద్రస్వామి ఉత్సవ విగ్రహానికి గ్రామోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

ఘనంగా బ్రహ్మంగారి ఆరాధనోత్సవాలు

ప్యాపిలి: స్థానిక వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో శనివారం విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షులు నాగరాజు ఆచారి ఆధ్వర్యంలో బ్రహ్మం గారి ఆరాధనోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వీరబ్రహ్మేంద్ర స్వామికి భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం స్వామివారి చిత్రపటానికి, ఉత్సవ మూర్తులకు పట్టణ వీధుల మీదుగా నిర్వహించిన గ్రామోత్సవంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.


గురువులతో పూర్వవిద్యార్థులు

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

కొలిమిగుండ్ల: మండల కేంద్రం కొలిమిగుండ్ల ఉన్నత పాఠశాల 2005–06కు చెందిన పదో తరగతి బ్యాచ్ పూర్వవిద్యార్థుల సమ్మేళనం శనివారం ఘనంగా జరిగింది. దాదాపు 18 ఏళ్ల తర్వాత పూర్వ విద్యార్థులు ఒకేవేదికపై చేరారు. వివిధ ప్రాంతాల్లో స్థిరపడినని స్నేహితులు ఆప్యాయంగా పలుకరించుకుంటూ ఉల్లాసంగా గడిపారు. అప్పట్లో విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఘనంగా సన్మానించారు.

భక్తిశ్రద్ధలతో వాసవీమాత జయంతి


హోమం నిర్వహిస్తున్న భక్తులు


పల్లకీ ఉత్సవం నిర్వహిస్తున్న భక్తులు

డోన్ టౌన్ : ఆర్యవైశ్యుల ఆరాధ్యదైవమైన శ్రీవాసవి మాత జయంతి ఉత్సవాలను శనివారం స్థానిక అమ్మవారిశాలలో అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేకంగా ముత్యాల చీరతో అలంకరించారు. ఉదయం గణపతి పూజ, కళషస్థాపన తదితర ప్రత్యేక పూజలు నిర్వహించారు. పట్టణంలోని శ్రీపోట్టి శ్రీరాముల విగ్రహం నుంచి ఆర్యవైశ్యులు ర్యాలీ నిర్వహించారు. సాయంత్రం మహిళలు కుంకుమార్చన తదితర పూజలు చేశారు. ఆర్యవైశ్య కిరాణ మర్చంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కేరళ వాయిద్యకారుల మధ్య అంగరంగ వైభవంగా అమ్మవారి పల్లకోత్సవం, గ్రామోత్సవం నిర్వహించారు.

వాసవీ మాతకు ప్రత్యేక పూజలు

బేతంచెర్ల: వాసవీమాత జయంతిని పురస్కరించుకుని శనివారం పట్టణంలోని అమ్మవారిశాల మండల ఆర్యవైశ్యసంఘం, యువజన సంఘం, వాసవి మహిళా మండలి సభ్యుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. నగర సంకీర్తన, అష్టోత్తర శత నామావాలి, అభిషేకం, కుంకుమార్చన మహా మంగళహారతి ఇచ్చారు. అనంతరం వేదపండితులు నంద, పవన్ కుమార్ శర్మ, సాయి కుమార్ శర్మ ఆధ్వర్యంలో 108 మంది దంపతులు సాముహిక హోమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్యులు గుండాగోపాల్, కందగడ్డల మోహన్ రావు, శేషా మోహన్, బచ్చు సుబ్రహ్మణ్యంశెట్టి, కందగడ్డల రామూర్తి, విష్ణు, బళ్లాని సూర్య, లక్ష్మినారాయణ, సుబ్బయ్య గుప్త తదితరులు పాల్గొన్నారు.


ముత్యాల చీరలో వాసవీ మాత


ప్రత్యేక అలంకరణలో వాసవీమాత

బనగానపల్లె రూరల్ : పట్టణంలోని కొండపేటలో వెలసిన వాసవీ కన్యకాపరమేశ్వరి దేవి ఆలయంలో అమ్మవారి జయంతి శనివారం ఘనంగా జరిగింది. ఆర్యవైశ్య భవనం నుంచి ఆర్యవైశ్య సంఘం, మహిళా సంఘం ఆధ్వర్యంలో మహిళలు 108 కలశాలతో ఆలయం చేరుకుని అమ్మవారి మూల విరాట్‌కు కలశాభిషేకం, ఉత్సవ విగ్రహానికి పాలాభిషేకం నిర్వహించారు. అలాగే మండలంలోని ఇల్లూరు కొత్తపేట, నందివర్గం గ్రామంలోని వాసవీ కన్యకాపరమేశ్వరిదేవి ఆలయంలో అమ్మవారి జయంతిని ఘనంగా నిర్వహించారు.


అమ్మవారి ఉత్సవ విగ్రహానికి పాలాభిషేకం నిర్వహిస్తున్న భక్తులు

ప్యాపిలి: స్థానిక శ్రీమత్ కన్యకా పరమేశ్వరి ఆలయంలో శనివారం వాసవీ మాత జయంతిని ఆర్యవైశ్యులు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆర్యవైశ్య మహిళలలో అధిక సంఖ్యలో పాల్గొని వాసవీమాతకు కుంకుమార్చన తదితర పూజా కార్యక్రమాలు చేపట్టారు. సాయంత్రం అమ్మవారి ఉత్సవమూర్తికి పట్టణ ప్రధాన వీధుల మీదుగా గ్రామోత్సవం నిర్వహించారు.

ఖరీఫ్‌కు ముందస్తు వర్షం


కోవెలకుంట్ల: స్థానిక వ్యవసాయ సబ్‌డివిజన్‌లో కురుస్తున్న భారీ వర్షాలు ఖరీఫ్ సీజన్‌కు అనుకూలంగా మారాయి. సబ్‌డివిజన్‌లోని ఉయ్యాలవాడ మండలంలో శనివారం అత్యధికంగా 117.4మి.మీ వర్షపాతం నమోదు కాగా సంజామల మండలంలో 48.6 మి.మీ, కోవెలకుంట్ల మండలంలో 30.4 మి.మీ,అవుకు మండలంలో 27.2మి.మీ, దొర్నిపాడు మండలంలో 13.2, కొలిమిగుండ్ల మండలంలో 11.4 మి.మీ వర్షపాతం నమోదైంది. ఖరీఫ్ సీజన్‌కు ముందే వర్షాలు అనుకూలంగా మారడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

అన్నదానం

డోన్ టౌన్ : స్ఫూర్తి సేవా సంస్థ సభ్యులు శనివారం దాతల ఆర్థిక సాయంతో సేవా కార్యక్రమాలు చేపట్టారు. పట్టణానికి చెందిన బీఎస్ఎన్ఎల్ రిటైర్డు ఉద్యోగి బేరి రామకృష్ణ,మల్లేశ్వరి దంపతుల సహకారంతో బేతంచెర్ల సర్కిల్‌లో మధ్యాహ్నం మజ్జిగ పంపిణీ చేశారు. అలాగే భోంస్లే ఈశ్వరరావు జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యుల సహకారంతో పద్మావతి అనాథ వృద్ధాశ్రమం, ఓబులాపురం సమీపంలోని శ్రీకాశిరెడ్డి నాయన వృద్ధాశ్రమంలో అన్నదానం చేశారు. కార్యక్రమాల్లో సంస్థ వ్యవస్థాపకులు సీసం గుంతల మధు, సభ్యులు పాల్గొన్నారు.

21 నుంచి లక్ష్మీ చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలు

డోన్: మండలంలోని యాపదిన్నె గ్రామంలో వెలసిన లక్ష్మీ చెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాలు ఈనెల 21వ తేదీ నుండి 22వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు దేవస్థానం ధర్మకర్తలు ఒక ప్రకటనలో తెలిపారు. 21న స్వామివారి ఆలయంలో గణపతి పూజ, అర్చన, తీర్థ ప్రసాదాల వినియోగం, గరుడోత్సవం , కోలాట నృత్య ప్రదర్శనలు ఉంటాయన్నారు. 22న లక్ష్మీ చెన్నకేశవ స్వామి కల్యాణ మహోత్సవాన్ని ఉదయం వేలాది మంది భక్తుల సమక్షంలో నిర్వహిస్తామన్నారు. అదేవిధంగా వృషభాల బండ లాగుడు పోటీలను నిర్వహిస్తున్నామన్నారు. విజేత వృషభాల యాజమానులకు వరుసగా రూ.35వేలు, రూ.20వేలు, రూ.10వేలు, రూ.5వేల చొప్పున అందజేస్తారన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు దినేష్‌గౌడ్, మాజీ కౌన్సిలర్ టమటం లక్ష్మిదేవి, రామాంజనేయులు భక్తులకు అన్నదాన చేస్తారన్నారు.


లక్ష్మీ చెన్నకేశవస్వామి

అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు

బనగానపల్లె రూరల్ : సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ అనంతరం గ్రామాల్లో ఎలాంటి అల్లర్లుకు పాల్పడినా, ప్రోత్సహించినా కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ తిరుపాల్ హెచ్చరించారు. శనివారం సాయంత్రం మండలంలోని నందివర్గం పోలీసు స్టేషన్ ఆవరణలో వివిధ పార్టీల రాజకీయ నాయకులతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ఎన్నికల కౌంటింగ్ రోజున గ్రామాల్లో ఎలాంటి విజయోత్సవ సంబరాలు చేయరాదని, రెచ్చగొట్టే విధంగా వ్యవహరించకూడదని సూచించారు. అన్ని గ్రామాల్లో 114 సెక్షన్ అమల్లో ఉందని, శాంతిభద్రతల పరిరక్షణకు నాయకులు సహకరించాలన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఐ తిరుపాల్

బేతంచెర్లలో 6.2 సెంటీమీటర్ల వర్షపాతం




అంబాపురంలో పొలంలో నిలిచిన వర్షపు నీరు, వర్షం నీటితో కళ కళలాడుతున్న ముచ్చట్ల వాగు చెక్ డ్యామ్

బేతంచెర్ల: మండలంలో శుక్రవారం సాయంత్రం నుంచి అర్ధరాత్రి వరకు 6.2 సెంటీమీటర్ల వర్షపాతం నమోదు అయినట్లు మండల వ్యవసాయ అధికారి కిరణ్ కుమార్ శనివారం తెలిపారు. ఖరీఫ్ ప్రారంభంలో భారీ వర్షం కురవడంతో వాగులు, వంకలు, చెక్ డ్యామ్‌లు పొంగిపొర్లాయి. కుంటలు, చెర్వులు వర్షం నీటితో కళకళలాడుతున్నాయి.

మండలంలో 34.6 మి.మీ వర్షపాతం

బనగానపల్లెరూరల్ : మండలంలో 34.6 మి.మీ వర్షపాతం నమోదైనట్లు మండల వ్యవసాయాధికారి సుబ్బారెడ్డి శనివారం తెలిపారు. శుక్రవారం సాయంత్రం నుంచి శనివారం ఉదయం వరకు ఈ వర్షపాతం నమోదైందన్నారు. వాతవరణం చల్లబడడంతో ప్రజలు ఉపశమనం పొందారు. ఈ వర్షాలు ఖరీఫ్ సాగుకు అనుకూలమని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

చల్లబడిన వాతావరణం

కొలిమిగుండ్ల: ఎండలు మండిపోతున్న తరుణంలో ఒక్క సారిగా వాతావరం చల్లబడింది. వైశాఖ మాసం రోహిణి కార్తీలో తీవ్రమైన ఉష్ణోగ్రతలు నమోదయ్యే సమయంలో వాతావరణంలో మార్పులు చోటు చేసుకొని వర్షాలు కురవడంతో ప్రజలు ఉపశమనం పొందుతున్నారు. శుక్రవారం రాత్రి మండలంలో మోస్తరు మించి వర్షం కురిసింది. 40 డిగ్రీల ఉష్ణోగ్రతలు 30 డిగ్రీలకు పడిపోయాయి. మండలంలో మేలో 8వ తేదీన 29.6 మి.మీ, 13న 43.2 మి.మీ, 17వ తేదీన 11.4 మి.మీ వర్షపాతం నమోదైంది. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు పండ్ల తోటల సాగు చేసిన రైతులకు ఊరటనిస్తుంది. ఈ వర్షాలకు భూమి బాగా తడిసిందని, ఇకపై మంచి వర్షం కురిస్తే వాగులు, వంకలు ప్రవహించే అవకాశం ఉందని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ముగ్గురిపై కేసు నమోదు

కొలిమిగుండ్ల: మండల పరిధిలోని బెలుంలో వీధిలో చోటు చేసుకున్న సమస్యపై ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేసుకున్నట్లు ఏఎస్ఐ గోవిందునాయక్ శనివారం తెలిపారు. ఇళ్ల రస్తా విషయంలో మనస్పర్థలు పెట్టుకొని పొగాకు లక్ష్మినారాయణకు చెందిన బుల్లెట్ బైక్ ఇంటి వద్ద నిలిపి ఉండగా చాకలి చిన్న కుళ్లాయి, వరలక్ష్మి,రాయుడు కట్టెలు, రాళ్లతో డ్యామేజ్ చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు ముగ్గురిపై కేసు నమోదు చేసుకున్నట్లు ఏఎస్ఐ పేర్కొన్నారు.